
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు


5

ఆదివారం 18 ఫిబ్రవరి 2024



సంక్షేమం కాదు.. సంక్షామం





- సంక్షేమం పేరుతో జగన్ ఒక చేత్తో పది ఇచ్చి..
- పన్నుల పేరుతో వంద లాగేసుకుంటున్న వైనం
- నవరత్నాలు కొందరికి.. పన్నుల బాదుడు అందరికీ
- చంద్రబాబు హయాంలో ఉచితంగా ఇసుక
- పెరగని కరెంటు, బస్‌చార్జీలు
- జగన్ పాలనలో బాదుడే బాదుడు
- అప్పట్లో రూ.300 వచ్చే కరెంటు బిల్లు నేడు రూ.500 పైమాటే

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ కొత్త స్లోగన్ అందుకున్నాడు. మరోసారి జనాన్ని మాయ చేసి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు మరో ఎత్తుగడ వేస్తున్నారు. నా వల్ల లబ్ధి పొంది ఉంటే మళ్లీ ఓటు వేయండి అంటున్నాడు. జగన్ సంక్షేమం అంతా చాక్లెట్ ఇచ్చి నెక్లెస్ ఎత్తుకెళ్లే తీరుగా ఉందని ఇప్పటికే విమర్శ ఉంది. జగన్ నాలుగేళ్ల పాలనలో సంక్షేమం మాటున నవరత్నాల పథకాలు కొందరికి మాత్రం లబ్ధి చేకూరితే.. ఆయన బాదుడుతో అందరూ బాధితులుగా మారారు. ఆర్టీసీ బస్‌చార్జీలు, కరంటు చార్జీలు, ఆస్తి పన్ను పెంచడం, చెత్తపన్ను వసూలు చేయడం, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం, ఎప్పుడో పాతికేళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లకు కూడా ఓటీయస్ పేరిట డబ్బులు గుంజడం.. ఇక భూ విలువల ధరలు భారీగా పెంచేయడం తెలిసిందే.. దశల వారీగా మద్యనిషేధం అంటూ మద్యం ధరలు అమాంతంగా పెంచేసి మందుబాబుల రక్తాన్ని పీల్చి ఖజానా నింపుకున్నారన్న విమర్శ ఉంది. చంద్రబాబు హయాంలో వచ్చిన పన్నులు, జగన్ హయాంలో వచ్చిన పన్నులపోట్లు చూస్తే కళ్లు బైర్లుకమ్మే విధంగా ఉన్నాయి. జగన్ సంక్షేమం పేరుతో అన్ని వర్గాలనూ సంక్షామంలోకి నెట్టేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

కరెంటు చార్జీలతో బాదుడే బాదుడు

ఒకప్పుడు కరెంటు ముట్టుకుంటే షాక్ కొట్టేది. జగన్ సీఎం అయిన తరువాత కరెంటు బిల్లులను ముట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి వచ్చింది. నాలుగేళ్లలో కరెంటు చార్జీలు ట్రూఅప్ చార్జీలు ఇతరత్రా పేరిట భారీగా పెంచారు. ఒకప్పుడు రూ.300 వస్తే ఇప్పుడు రూ.600 పైమాటే బిల్లు వస్తుంది. 2019 మార్చి నెలలో జిల్లాలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు 8,14,685 ఉండేవి. ఆ నెల బిల్లుల డిమాండ్ రూ.41.5కోట్లు. జగన్ సీఎం అయిన తరువాత కరెంటు చార్జీలు భారీగా పెరిగాయి. 2024 జనవరిలో అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లు 10,00,969 ఉన్నాయి. అయితే కరెంటు బిల్లులు మాత్రం డిమాండ్ రూ.75.17 కోట్లకు చేరుకుంది. కనెక్షన్లు స్వల్పంగా పెరిగినప్పటికీ కరెంటు బిల్లులు మాత్రం దాదాపు రెట్టింపయ్యాయి.

కార్పొరేషన్‌లలో ఆస్తి పన్నుల భారం

కడప కార్పొరేషన్‌లో ఆస్తి పన్నులు పెంచి ప్రజలపై భారం మోపవద్దని పౌర సమాజంతోపాటు ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అయినప్పటికీ లెక్క చేయకుండా ఆస్తి పన్ను పెంచేశారు. రిజిస్ట్రేషన్ విలువ ఆధారితంగా పెంచారు. దీంతో ఇంటి పన్నుల బాదుడు భారీగా పెరిగింది. దీని వల్ల అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి భారంగా మారింది. కడప కార్పొరేషన్‌లో 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను డిమాండ్ రూ.23.98కోట్లు కాగా .. 2023-24కు ఇది రూ.40.76 కోట్లకు చేరింది. కడపతో పాగు ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల మునిసిపాలిటీల్లోనూ ఆస్తిపన్నుల డిమాండ్ వైసీపీ ప్రభుత్వం వచ్చాక దాదాపు రెట్టింపయింది. జిల్లాలోని కడప కార్పొరేషన్‌తో పాటు ఐదు మునిసిపాలిటీలకు కలిపి 2019-20లో ఆస్తిపన్ను డిమాండ్ రూ.47.47 కోట్లుగా ఉండేది. 2023-24 నాటికి ఆస్తుల సంఖ్య పెద్దగా పెరగకపోయినా ఆస్తిపన్ను డిమాండ్ మాత్రం 77.05 కోట్లకు చేరింది. అంటే ఆస్తిపన్ను దాదాపు 70శాతం పెరిగింది.

ఆస్తిపన్ను భారం ఇలా..

మున్సిపాలిటీ	ఆర్థిక సంవత్సరం	అసెస్‌మెంట్స్	ఆస్తిపన్ను రూ.కోట్లలో..
కడప	2019-20	90,981	23.98
	2023-24	99,551	40.76
ప్రొద్దుటూరు	2019-20	30,978	13.53
	2023-24	33,175	18.45
బద్వేలు	2019-20	23,540	2.96
	2022-23	23,740	4.44
మైదుకూరు	2019-20	12,281	1.97
	2023-24	12,838	4.71
జమ్మలమడుగు	2019-20	10,905	1.23
	2023-24	11,192	2.20
పులివెందుల	2019-20	21,950	3.8
	2023-24	----	6.49

మందుబాబుల రక్తం తాగుతున్నారు

అధికారంలోకి వస్తే దశల వారీగా మద్య నిషేధం అంటూ సీఎం జగన్ హామీ ఇచ్చారు. మద్యం మాన్పించడంలో భాగంగా ధరలు పెంచుతున్నట్లు కటింగ్ ఇచ్చారు. మద్యం ధరలను అమాంతంగా పెంచారు. చంద్రబాబు హయాంలో రూ.50కి దొరికే చీప్ లిక్కరు జగన్ హయాంలో రూ.150 చేరుకుంది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేవలం గత డిసెంబరు నాటికి రూ.5317.66 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇక జిల్లాలో పొరుగు మద్యం విక్రయాలు జగన్ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.8వేల కోట్ల పైమాటే ఉంటుందని సమాచారం.

ఉచిత ఇసుకకు మంగళం

చంద్రబాబు హయాంలో ఇసుక ఉచితంగా దొరికేది. కడపలో ట్రాక్టరు ఇసుక రూ.2,500 నుంచి రూ.3వేలకు దొరికేది. ఇప్పుడు ధర రెట్టింపు అయింది. ఈ నాలుగేళ్లకాలంలో దాదాపు ఇసుక ద్వారా రూ.400 కోట్లకు పైగా భారం జనంపై పడిందంటారు.

బస్‌చార్జీల మోత

పేద, సామాన్యుడికి ఆర్టీసీ బస్సే దిక్కు. అయితే జగన్ అండ్ కో ఆర్టీసీ బస్సుల్లో కూడా చార్జీల మోత మోగించారు. సాధారణంగా ఆర్టీసీకి వేసవి, పండుగల సమయంలో మంచి ఆక్యుపెన్సీ ఉంటుంది. లాభాలు వస్తాయి. 2019 మార్చిలో జిల్లాలో అప్పుడు 8డిపోలు ఉండేవి. 913 బస్సులు ఉండేవి. అప్పట్లో ఆర్టీసీ నెల ఆదాయం రూ.28.2 కోట్లు. ఇక 2023 డిసెంబరులో ఆ డిపోల పరిధిలో 613 బస్సులు ఉండగా ఆదాయం రూ.26.8 కోట్లు. బస్సుల సంఖ్య తగ్గినా చార్జీల పెంపు వల్ల ఆదాయం వచ్చేసింది.

ఓటీఎస్ పేరిట బాదుడు

దివంగత ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పటి నుంచి పేదలకు పక్కాగృహాలు ఇస్తూ వస్తున్నారు. అంటే దాదాపు 40 సంవత్సరాలుగా వీరు ఆ ఇళ్లలో ఉంటున్నారు. ఈ గృహాలకు సర్వహక్కులు కల్పిస్తామని చెప్పి జగన్ ఓటీఎస్ అంటూ తెరమీదకు తెచ్చారు. పదివేలు కడితే మీకు సర్వహక్కులు కల్పిస్తాం, మీరు అమ్ముకోవచ్చం టూ జిమ్మిక్కులు చేశారు. రిజిస్ట్రేషన్ కోసం జనాన్ని ఇబ్బందులు పెట్టారు. సుమారు 21వేలకు పైగా గృహాల రిజిస్ట్రేషన్‌తో రూ.14 కోట్ల మేర ఓటీఎస్ ద్వారా డబ్బులు జనాన్ని ముక్కుపిండి వసూలు చేశారు.

రిజిస్ట్రేషన్ల భారం

ఏదైనా ప్రభుత్వం అభివృద్ధి చేసి ఖజానా నింపుకునేందుకు ప్రయత్నం చేస్తుంటుంది. అయితే జగన్ సర్కారు మాత్రం పన్నుల పేరిట జనాలపై భారం మోపి ఖజానా నింపుకునే యత్నం చేశారు. ఇందుకోసం భూ విలువలు పెంచేశారు. ఎకరా లక్ష ఉండే స్థలాన్ని ఐదు లక్షలకు, ఐదు ఉండేది పది లక్షలకు ధరలు పెంచి రిజిస్ట్రేషన్ ఆదాయం పెంచేస్తున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.250 కోట్లకు పైగా ఆదాయం వస్తే 2023-24 ఆర్థిక సంవత్సరానికి అది రూ.450కోట్లకు పైగా చేరుకుందంటారు. అంటే సగానికి సగం పెంచేశారు. దీంతో పాటు పొరుగు రాష్ట్రాల కన్నా డీజలు, పెట్రోలు ధరలు మన వద్దనే అధికంగా ఉన్నాయి. దీంతో ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెరగడంతో నిత్యావసర ధరలన్నీ పెరిగాయి. అదంతా జనంపైనే భారం పడింది. అంటే ఒక్కో కుటుంబం ఖర్చు జగన్ ప్రభుత్వంలో రెట్టింపయింది. ఇదీ మన జగనన్న సంక్షేమం మాయ అంటే.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు



ఉద్యోగుల సొమ్ము దోచుకున్నారు

- టీ, బిస్కెట్ చర్చలు తప్ప చెల్లింపులు లేవు
- ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలే శరణ్యం
- కలెక్టరేట్ ఎదుట జేఏసీ నేతల హెచ్చరిక

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి17: ఉద్యోగులు తినోతినకనో ఏళ్లతరబడి దాచుకున్న సొమ్మును అవసరాలకు చెల్లించకుండా రూ.20 వేల కోట్లు ప్రభుత్వం వాడుకోవడం దుర్మార్గమని, వెంటనే చెల్లింపులు చేయాలనీ ఏపీ జేఏసీ నేతలు బి.శ్రీనివాసులు, నాగిరెడ్డి, లక్ష్మీరాజా, రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు మహావీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఉద్యోగులు దాచుకున్న సొమ్మును అడిగితే ముఖ్యమంత్రికి గానీ, ప్రభుత్వ అధికారులకు గానీ చీమ కుట్టినట్టుగా కూడా లేదన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. కనీసం ఎన్నికల సమయంలో అయినా సమస్యలు తీరతాయని భావిస్తే చర్చల పేరుతో టీ బిస్కెట్లతో సరిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించక పోతే తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమని, చలో విజయవాడ విజయవంతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య, జేఏసీ నాయకులు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, బాలపుల్లయ్య, నిర్మలా జ్యోతి, గౌరి, కాటమయ్య, అరుణమ్మ, కృష్ణకుమారితో పాటు పెద్దఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు అభివృద్ధికి టీడీపీని గెలిపించండి

- ఎన్నికల ప్రచారం ప్రారంభించిన సీఎం సురేశ్ నాయుడు



రామేశ్వరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 17: ప్రొద్దుటూరులో అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని టీడీపీ నేత సీఎం సురేశ్‌నాయుడు ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఉదయం స్థానిక రామేశ్వరంలోని తమ ఇలవేల్పు అయిన మునిస్వామి ఆలయం, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సురేశ్‌నాయుడు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనసేన జిల్లా నాయకుడు సుంకర శ్రీనివాస్, ప్రొద్దుటూరు కన్వీనర్ జిలాన్, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, ప్రొద్దుటూరు మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్తియార్, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజుతో కలిసి వేలాదిమంది కార్యకర్తల నడుమ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా సురేశ్‌నాయుడు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో వైసీపీ చేసిన అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామన్నారు. రెండు దఫాలుగా రాచమల్లును ఎమ్మెల్యేగా గెలిపించినా ఆయన ప్రజలకు ఏమి చేశాడో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. అందువల్లే ప్రొద్దుటూరులో ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని.. ఆయన సారథ్యంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేసి ఓటర్లను టీడీపీకి ఓటెయ్యాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, టీడీపీ నాయకులు ఖలీల్, చెన్నయ్య, నిజాం, మెట్టుపల్లి జయవర్ధన్‌రెడ్డి, మార్తల రఘు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం సురేశ్‌నాయుడు

అశ్వవాహనంపై అభయప్రదాత



కడప (కల్చరల్), ఫిబ్రవరి 17: దేవుని కడప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం సర్వభూపాల వాహనంపై, రాత్రి 8 గంటలకు అశ్వవాహనంపై కోనేటిరాయుడు భక్తులకు అభయమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్, కృష్ణమోహన్ సారథ్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం, ఊంజల్ సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమలేశుడు మాడ వీధుల గ్రామోత్సవంలో కోలాటాలు, చెక్కభజనలతో భక్తులు ఆనంద డోలికల్లో తేలియాడారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే ఏర్పాటు చేసిన అన్నమాచార్య సంకీర్తనలు, హరికథా గానం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా

- డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి17: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘాతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎన్నికల నోడల్ అధికారులు, పోలీసు, కమర్షియల్ టాక్సెస్, ఎక్సైజ్, మైన్స్, ఇన్‌కమ్ టాక్సు శాఖల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, అదనపు ఎస్పీ సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని, ఎక్కడా మద్యం, డబ్బు, మాదక ద్రవ్యాలు, విలువైన వస్తువులు అక్రమ రవాణా జరగకుండా చూడాలని అన్నారు. సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్టుల్లో పట్టుబడిన వస్తువులకు సంబంధించి రోజువారీగా నివేదికలు ఇవ్వాలన్నారు. సెన్సిటివ్ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, ఎస్డీసీ చంద్రమోహన్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, ఈఆర్వోలు, ఎన్నికల పోలీసు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు.. పూర్తయ్యేదెన్నడు..?

- రూ.3.90 కోట్లు నిధుల మంజూరులో జాప్యం
- అర్ధంతరంగా ఆగిన పనులు

చాపాడు, ఫిబ్రవరి 17: వైసీపీ ప్రభుత్వం నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చేశామంటూ గొప్పలు చెప్పుకుంటోంది. వాస్తవానికి చాలా చోట్ల నిధులు విడుదల కాక నాడు-నేడు పనులు అంసపూర్తిగా ఆగిపోయాయి. దీంతో విద్యార్థుల చదువులకు ఇబ్బంది ఏర్పడింది.

చాపాడు మండలంలో ఫేజ్-2 కింద ప్రభుత్వం 2023-24 సంవత్సరంలో 23 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. మొత్తం రూ.8.3 కోట్లు మంజూరు చేసింది. ఈ పాఠశాలల్లో ఇప్పటి వరకు చేసిన పనులకు ఇంకా రూ.3.91 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉంది. నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తరగతి గదుల నిర్మాణాలు, బండల చప్పట, రంగులు వేయడం, టైల్స్ బిగించడం, తాగునీరు ఏర్పాటు చేయడం వంటివి చేయలేదు. కరెంటు కోసం, వాకిళ్లు, టీవీలు, బెంచీలు, కిటికీలు, బోర్డులు, శానిటరీ మెటీరియల్స్‌ను ప్రభుత్వం ఇప్పటికి సరఫరా చేయలేదు.



గుంత చీపాడులో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్డి

నిధులు విడుదల కాకపోవడంతో..


పల్లవోలు దళితవాడ, ఖాదర్‌పల్లె (తెలుగుమీడియం), నెర్రవాడ, సిద్ధారెడ్డిపల్లె, ఖాదర్‌పల్లె, గుంతచీపాడు, అయ్యవారుపల్లె, చియ్యపాడు దళితవాడ, చిన్నగురవలూరు గ్రామాల్లోని పాఠశాలలకు నిధులు రావాల్సి ఉంది. కొన్ని నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. నిధుల కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా అధికారులు ప్రధానోపాధ్యాయులకు హుకుం జారీ చేస్తున్నారు. కానీ నిధులు మంజూరు చేయడంలో జిల్లా అధికారులు చేతులెత్తేస్తున్నారు. నిధులు లేకుండా తామెలా పనులు చేయగలమని హెచ్ఎంలు ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాలల్లో సుమారు 700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా.. కొన్ని పాఠశాలలకు తరగతి గదులు నిర్మించుకునేందుకు స్థలాలు లేవు. చాలా ప్రభుత్వ పాఠశాలలకు ఆటస్థలాలు కూడా లేవు.

మెయింటెనెన్స్ నిధులూ రాలేదు

ప్రతి ఏడాది ప్రభుత్వం పాఠశాలలకు మెయింటెనెన్స్ కింద డబ్బులు విడుదల చేయాల్సి ఉంది. కానీ ఇటీవల వైసీపీ ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయలేదు. దీంతో కరెంటు బిల్లులకు తమ సొంత డబ్బులు చెల్లిస్తున్నామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మరుగుదొడ్లకు విధిలేని పరిస్థితుల్లో పాతడోర్లు బిగించారు.

ఫేజ్-3 అట..

నాడు-నేడు పేరుతో పాఠశాలల అభివృద్ధి చేపట్టడ మంచిదే. అయితే ఇది కాగితాలపై తప్ప వాస్తవంలో కనిపించడం లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 2020-21లో ఫేజ్-1 కింద చేపట్టిన కొన్ని పాఠశాలలో కూడా సీపీఎం కింద మెటీరియల్స్ ఇంకా సరఫరా చేయలేదు. ఫేజ్-2 కింద పనులు చేపట్టిన పాఠశాలలకు ఇంకా పూర్తి స్థాయిలో నిధులూ రాలేదు.. మెటీరియలూ పంపిణీ చేయలేదు. ఈ పనులు పూర్తికాకనే.. ఫేజ్-3 కింద వచ్చే జూన్ నెల నుంచి 62 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిధులు విడుదల చేసి ఫేజ్-2 కింద 23 పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ముందుగా పూర్తి చేయాలని, తర్వాతనే ఫేజ్-3 పనులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ఖాదర్‌పల్లెలో నిలిచిపోయిన తరగతి గది నిర్మాణం

ఎంఈవో వివరణ

ఈ విషయమై చాపాడు ఎంఈవో రవిశంకర్‌ను వివరణ కోరగా.. ఫేజ్-2 కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిధుల కొరతతో నిలిచిపోయిన విషయం వాస్తవమే అన్నారు. ప్రభుత్వం మళ్లీ నిధులు విడుదల చేయగానే పనులు చేస్తామన్నారు. ఇంకా కొన్ని పాఠశాలలకు మెటీరియల్ సరఫరా చేయాల్సి ఉందన్నారు.

అలా.. సిద్ధం చేశారు..!

- రాప్తాడు జగన్ సిద్ధం సభకు జిల్లా నుంచి భారీగా జనం తరలింపు
- స్కూలు బస్సులన్నీ అనంతపురం వైపే
- 330 ఆర్టీసీ బస్సులూ సిద్ధం

(కడప-ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలోని రాప్తాడులో ఆదివారం నిర్వహించనున్న సిద్ధం బహిరంగసభకు జిల్లానుంచి బారీగా జన సమీకరణ చేసేందుకు వైసీపీ నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. జగన్ సొంత జిల్లా నుంచే భారీ జనసమీకరణ చేయాలని వైసీపీ నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు వారం క్రితమే నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు వేల నుంచి పది వేల మంది జనాన్ని తీసుకెళ్లాలని చెబుతున్నారు. సమావేశానికి వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, సంక్షేమ పథకాలు తీసుకున్న వారందరినీ తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు. ఉన్నత స్థాయి నుంచి వత్తిళ్లు రావడంతో జనసమీకరణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

830 బస్సుల్లో..

జిల్లా నుంచి 500ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల ద్వారా సిద్ధం సభకు జనాలను తీసుకెళుతున్నారు. ఆర్టీఓల ద్వారా స్కూలు యాజమాన్యంపై వత్తిడి తెచ్చి బస్సులను తీసుకెళుతున్నారు. ఇక 330ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు. వలంటీర్లందరూ సిద్ధం సభకు రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల వారీగా, సర్పంచ్‌ల వారీగా, మండలాల వారీగా జన సమీకరణ టార్గెట్ పెట్టుకున్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కార్పొరేటరు, కౌన్సిలర్లకు జనాన్ని టార్గెట్ ఇచ్చారు. ఖర్చులకు కూడా కొంత సొమ్ము ముట్టజెప్పినట్లు తెలుస్తోంది.

99 శాతం హామీలన్నీ అమలు చేశామని గొప్పలు చెప్పు కుంటున్న వైసీపీ నేతలు సీఎం జగన్ సభకు ఇంత పెద్ద ఎత్తున బలవంతంగా జనాన్ని తరలించాల్సిన అవసరం ఏమొచ్చిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతగా లబ్ధి పొంది ఉంటే జనమే స్వచ్ఛందంగా తరలి వెళతారు కదా, ఇలా బలవంతం చేయడం ఎందుకు అని పలువురు చర్చించుకుంటున్నారు.

వలంటీర్లకు వచ్చిన సమాచారం ఇదే

కడప నగరంలో వలంటీర్లకు కార్పొరేటర్ల పేరుతో మెసేజ్‌లు వచ్చాయి. ఓ డివిజన్‌లోని వలంటీర్లకు.. 'మన గౌరవ కార్పొరేటరు ఆదేశాల మేరకు 18.1.2024న ఆదివారం ఉదయం 7గంటలకు అనంతపురంలో జరిగే సిద్ధం సభకు మన సచివాలయం వలంటీర్లు అందరూ రావాలని తెలిపారు. పోలీసు పెట్రోలు బంకు దగ్గర బస్ ఉంటుంది. మనకు భోజనం, ఇతర అన్ని సదుపాయాలు కల్పిస్తారు. ఈ విషయం అందరు వలంటీర్లు గమనించి ఏవైనా సందేహాలు సమస్యలు ఉంటే కార్పొరేటరును సంప్రదించండి..' అంటూ మెసేజ్‌లు పంపించారు. అంటే.. చివరకు పొరుగు జిల్లాలో జరిగే సీఎం సభకు కూడా ఇక్కడి వలంటీర్లను సైతం బలవంతంగా తరలిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని చూసి 'అట్లుంటది మన జగనన్న వాడకం' అంటూ పలువురు సెటైర్లు వేస్తున్నారు.



రాయచోటి ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణీకులు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

మొదటి బహుమతి కైవసం చేసుకున్న మైదుకూరు వృషభాలు

నందలూరు, ఫిబ్రవరి 17: భోగాంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం నిర్వహి ంచిన బండలాగుడు పోటీలను తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి, జనసేన నాయకుడు అతికారి కృష్ణ ప్రారంభించా రు. ఈ పోటీలలో మైదుకూరు కుర్రా వెంకటేష్ యాదవ్ ఎద్దు మొదటి స్థానంలో నిలిచి రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి విరాళంగా అందజేసిన 50 వేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారు. కడప జిల్లా మూలపల్లె, మూలప్రసాద్‌రెడ్డి ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి చమర్తి జగన్ మోహన్‌రాజు అందజేసిన రూ. 40 వేలు కైవసం చేసుకున్నారు. గోసులవారిపల్లె వెంకటరమణారెడ్డి వృషభాలు మూడవ స్థానంలో నిలిచి మేడా విజయశేఖర్‌రెడ్డి ప్రకటించిన రూ. 30వేల రూపాయలు అందుకున్నారు. కొట్టాలపల్లి రవి ఎద్దు నాల్గవ స్థానం, చాపాడు గ్రామం స్వామి ఈతాల రెడ్డి ఎద్దులు ఐదవ స్థానంలో నిలిచాయి. నూకినేనిపల్లెకు చెందిన డాక్టర్ గణపతి శంకర్, సంబావు చంద్రశేఖర్, లక్ష్మయ్యల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగగా, గుత్తికి చెందిన నారాయణ స్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రాత్రికి కుంపిణీపురం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేలారే రేలా కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ రాముడు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసులు చంద్రయ్య, దిలీప్ కుమార్‌లు బందోబస్తు నిర్వహించారు.



పోటీల్లో బండను లాగుతున్న ఎద్దులు

నేటి నుంచి ఆంధ్రా-రైల్వే జట్ల క్రికెట్ మ్యాచ్

కడప (స్పోర్ట్స్) ఫిబ్రవరి 17: నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 18వ తేదీ ఆదివారం నుంచి 21వ తేదీ వరకూ కల్నల్ సి.కె.నాయుడు ట్రోఫీలో భాగంగా అండర్-23 గ్రూప్ క్రీడాకారుల క్రికెట్ మ్యాచ్ జరుగుతుందని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. నాలుగు రోజుల పాటు జరగనున్న క్రికెట్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచేందుకు రెండు జట్ల క్రీడాకారులు చాలా ఉత్సాహంగా సిద్ధమైనట్లు వెల్లడించారు.

ఉర్దూ డిగ్రీ కళాశాల.. ఉత్తిదేనా?

- సీఎం హామీ ఇచ్చి రెండేళ్లయినా అతీగతీ లేదు
- ఇంటర్‌తో చదువు మానేస్తున్న ఉర్దూ విద్యార్థులు
- ఈ విద్యా సంవత్సరమైనా ఏర్పటయ్యేనా..

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 17: జిల్లాలో కడప తర్వాత ఎక్కువ మంది ముస్లిం మైనారిటీలు ప్రొద్దుటూరులో ఉన్నారు. పట్టణంలో ఉన్న వనరులను దృష్టిలో ఉంచుకుని చుట్టుపక్కల నియోజకవర్గాలకు చెందిన ముస్లిం మైనారిటీలు ప్రొద్దుటూరుతో అనుబంధం ఏర్పరచుకున్నారు. ప్రొద్దుటూరులో 60 వేల వరకు ముస్లిం జనాభా ఉంది. ముస్లిం మైనారిటీ విద్యార్థుల కోసం ఇక్కడ 10 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు, 2 యూపీ ఉర్దూ పాఠశాలలు, మూడు ఉర్దూ ఉన్నత పాఠశాలలు, ఒక ఉర్దూ జూనియర్ కళాశాల ఉన్నాయి. ఆపై ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఉర్దూ మీడియం కళాశాలలు లేక విద్యార్థులు అర్ధాంతరంగా చదువులు చాలిస్తున్నారు.

ప్రొద్దుటూరులో ఉన్న ఉర్దూ జూనియర్ కళాశాలకు, పట్టణంతోపాటు ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, రాజుపాళెం, చాపాడు ప్రాంతాల నుంచి విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారు. వీరిలో చాలామంది ఇంటర్ పూర్తయ్యాక డిగ్రీ చదవడానికి అవకాశం లేక చదువు ఆపేస్తున్నారు. కొందరు విద్యార్థులు విద్యపై ఆసక్తితో ఇంగ్లీషు మీడియం లేదా తెలుగు మీడియంలో చదువును కొనుసాగిస్తున్నారు.

2022లోనే ప్రారంభిస్తామన్నారు

ప్రభుత్వం ఉర్దూ రెండవ అధికార భాషగా గుర్తించినా భాషాభివృద్ధికి అవసరమైన వసతులను కల్పించడం లేదు. చిన్న పట్టణమైన మైదుకూరులో ఉర్దూ లైబ్రరీ, ఉర్దూ కంప్యూటర్ సెంటర్లు ఉండగా, ప్రొద్దుటూరులో ఉర్దూ లైబ్రరీ లేకపోవడం గమనార్హం. 2021లో ప్రొద్దుటూరులో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీ నాయకుల కోరిక మేరకు ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 2022 విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిస్తామని, కళాశాల ఏర్పాటుకు సొంత స్థలం కేటాయిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రకటించారు. దీంతో కొంత మంది ముస్లిం మైనారిటీ నాయకులు, కొందరు మత పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అయితే ముఖ్యమంత్రి హామీ ఇచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటికీ కళాశాల ఏర్పాటు చేయలేదని ఉర్దూ మీడియం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉర్దూ భాషాభివృద్ధిపై చిన్నచూపు తగదని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి అయినా ఉర్దూ డిగ్రీకళాశాల ప్రారంభించి ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని కోరుతున్నారు.



ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల

ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలి..



రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినా ఇంతవరకు ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అయినా తరగతులు ప్రారంభించి ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలి.

- జహీర్, విద్యార్థి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

ఇంటర్‌తోనే చదువు మానుకోవాల్సి వస్తోంది..



ఉర్దూ మీడియం డిగ్రీ కళాశాల లేకపోడంతో బాలికలు ఇంటర్‌తోనే చదువు మానుకుంటున్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ప్రొద్దుటూరులో ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి మైనారిటీల అభివృద్ధికి కృషి చేయాలి.

- హర్షాద్, విద్యార్థి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

స్కూటర్ ఢీకొని విద్యార్థులకు గాయాలు

సుండుపల్లె, ఫిబ్రవరి 17: మండల పరిధిలోని మడితాడు పంచాయతీ జీకే రాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో స్కూటర్ ఢీకొని ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. శనవారం ఉదయం జీకే రాచపల్లె హాస్టల్ నుంచి రోడ్డు పక్క నుంచి విద్యార్థులు పాఠశాలకు వెళుతుండగా రాయవరం వైపు నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు మరో స్కూటర్‌ను ఢీకొట్టడంతో పాటు విద్యార్థులు పైకి దూసుకురావడంతో 9వ తరగతి చదువుతున్న తౌఫిక్, రెడ్డిగణేశ్‌లు గాయపడ్డారు. వారితో పాటు పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు వారిని సుండుపల్లె ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ విద్యార్థులు కాళ్లకు గాయాలైనట్లు గుర్తించి రాయచోటికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో ఇద్దరినీ ఆటోలో రాయచోటి ఆసుపత్రికి తరలించారు.



విద్యార్థులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

విద్యార్థులకు డీఈఓ అనురాధ సూచన

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 17: సమయాన్ని సద్వినియోగం చేసుకొని లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.అనురాధ విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని నంది మండలం జడ్పీ హైస్కూల్, ఇసుకపల్లె ఎంపీపీఎస్, పెండ్లిమర్రి ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్ష కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలోని మౌలిక సదుపాయాల గురించి అడిగారు. 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై పరీక్షల గురించి వారిలో ఉన్న భయాలను అపోహలను తొలగించి మంచి సలహాలు సూచనలు ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకాన్ని, పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆర్వో ప్లాంట్ పరిశీలించి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

కుష్ఠు, ఎయిడ్స్‌పై వీధి నాటకాలు

నేటి నుంచి 29 వరకు అవగాహన కార్యక్రమాలు : డీఎంహెచ్‌వో

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 17: హెచ్ఐవీ ఎయిడ్స్, కుష్ఠు, రక్తదానం, సుఖవ్యాధులు, క్షయవ్యాధులకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళాజాతా బృందాలతో వీధినాటకాలు వేయించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడ కమిషనర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ విభాగం డాక్టర్ రవిబాబు, డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో కళాజాతాను నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ నుంచి 29 వరకు కళాజాతా బృందాలు వీధినాటకాల ద్వారా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లయ్య, ప్రోగ్రామ్ అధికారి వి.భాస్కర్, పాజిటివ్ నెట్‌వర్క్ మహిళలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.



కళాజాతా ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

పుట్టగొడుగుల పెంపకంలో శిక్షణ

వైవీయూను సందర్శించిన అనంతపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ప్రొఫెసరు చంద్రమతి శంకర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 17 : అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వైవీయూ బయోటెక్నాలజీ శాఖను శనివారం సందర్శించారు. ఆ శాఖ ప్రొఫెసరు చంద్రమతి శంకర్ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం ప్రాథమిక దశ నుంచి మార్కెటింగ్ వరకు ప్రయోగాత్మకంగా శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో గ్రామీణ ప్రాంతాల్లో సైతం పుట్టగొడుగుల పెంపకం చిన్నతరహా పరిశ్రమగా ప్రారంభించవచ్చని సూచించారు.

పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన మౌళిక వసతులు, పెట్టుబడి లాభాల గురించి వివరించారు. వైవీయు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి హాజరై శిక్షణకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కడప (స్పోర్ట్స్) ఫిబ్రవరి 17: విద్యతో పాటు వివిధ క్రీడా విభాగాలలో కూడా బాల,బాలికలు రాణించి తద్వారా మంచి క్రీడాకారులుగా ఎదిగి క్రీడా కోటాలో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా 33వ కబడ్డీ సబ్ జూనియర్స్ బాల, బాలికల క్రీడా ఎంపికలు నిర్వహించారు. కడప జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య సారథ్యంలో చేపట్టిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి పలువురు బాల, బాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లా సత్తెనపల్లెలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సునీత, ట్రెజరర్ కొండయ్య, పీడీలు పద్మలత, నాగార్జునయ్య, విశ్వనాథ్, చంద్రావతి, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు వేణు, లీలావతితో పాటు పలువురు బాల, బాలికలు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అరుణకుమారి

జ్ఞానాన్ని తరతరాలకు అందించేది అక్షరం

వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 17 : జ్ఞానాన్ని తరతరాలకు అందించేది అక్షరమని, దాన్ని హస్తగతం చేయించేవారు చిరంజీవులు అవుతారని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎస్.ఈశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరం గ్రాండ్ ఇన్ హోటల్‌లోని సమావేశమందిరంలో ఇంటాక్ ఆధ్వర్యంలో ఎస్.ఇలియాస్ రెడ్డి సంపాదకత్వంలో డాక్టర్ పాలెం వేణుగోపాల్ రచించిన మన స్వాతంత్రోద్యమ సంగతులు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఇంటాక్ కడప చాప్టర్ లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ జ్ఞాన విస్తృతికి సమాజాన్ని విజ్ఞాన సంపదగా తీర్చిదిద్దడానికి పుస్తకాలు దోహదపడతాయన్నారు. పుస్తకాలను మనం చదవడం మ న పిల్లలను చదివించే అలవాటు ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. పిల్ల ల్లో మార్పునకు ఇవి వెలుగులు అవుతాయన్నారు. రేపటి సమాజానికి మనం ఇచ్చే వారసత్వ సంపద విజ్ఞానంతో కూడిన పుస్తకాలేనని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ వారి ఆలోచనలు, అనుభవాలకు అక్షరరూపం ఇచ్చే రేపటి తరానికి అందించాలని కోరారు. అనంతరం మానస చిన్నపరెడ్డి మాట్లాడారు. ఇంటాక్ శాశ్వత సభ్యులు బోగాల కొండారెడ్డి, రాఘవేంద్ర వర్మ, భాస్కరవర్మ, పయ్యావుల వేణుగోపాల్, వై.చిన్నపరెడ్డి, కె.సంజీవరెడ్డి, వై.జోజిరెడ్డి, బాలయల్లారెడ్డి, వెంకటేశ్వరాచారి, గంగాధర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి

శరవేగంగా గండిలో రాజగోపుర నిర్మాణం పనులు

చక్రాయపేట, ఫిబ్రవరి 17: గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో పడమటి రాజగోపురం, ప్రహరీ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఛైర్మన్ కా వలి కృష్ణతేజ, కావలి హరినాథ్, ఎం.హరి, భరత్‌రెడ్డి ఈ పనుల ను చేపట్టారు. సహా య కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి పనులు వేగవంతం చేసి సకాలంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదివరకే సహాయ కమిషనర్ ముకుందరెడ్డి, ఛైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ ఆలయ ప్రారంభోత్సవానికి కావాల్సిన సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో బండపరుపు, చిన్నచిన్న పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు రూ.20 కోట్ల నిధులు గండికి వెచ్చించారు. భక్తులు కూడా ఆలయం ఎప్పుడెప్పుడు ప్రారంభిస్తారా అని ఎదురు చూస్తున్నారు. గత మూడేళ్లగా బాలాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్నారు.



పడమటి రాజగోపురం నిర్మాణానికి పనులు జరుగుతున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నందలూరు, ఫిబ్రవరి 17 : కడప-చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు, రాజంపేట మధ్యలో పంజాబీ డాబా వద్ద శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని బైకుపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మండలంలోని ఆడపూరు గ్రామానికి చెందిన కలిశెట్టి పెంచలయ్య (25), పెనగలూరు ఈశ్వరయ్య (28) బైకుపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మన్నూరు పోలీసులు మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




ప్రమాదంలో మృతి చెందిన పెంచలయ్య, ఈశ్వరయ్య

చికిత్స పొందుతూ మహిళ మృతి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17: భర్తతో గొడవ పడి ఆత్మహత్యాయత్నం చేసుకున్న యువతి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మదనపల్లె మండలం కొత్తిండ్లు పంచాయతీ రంగా రెడ్డికాలనికి చెందిన చైతన్య భార్య శశికళ(28) ఇటీవల తెలిసిన వారికి డబ్బులు అప్పుగా ఇచ్చింది. ఈ విషయం తెలిసి ఆమె భర్త చైతన్య మందలించడంతో ఈనెల 15వ తేది శశికళ మనస్థాపంతో ఎలుకల మందు తినేసింది. గమనించిన కుటుంబీ కులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, రెండు రోజుల పాటు చికిత్స పొందితూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలుంటే అధికారులకు తెలపండి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్నమయ్య జిల్లా కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 17: ఎన్నికలకు సంబంధించి ఏ సమస్యలైనా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్‌లో వివిధ రాజకీట పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, వెబ్ కాస్టింగ్, సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై ఏ సమస్యలు ఉన్నా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే ఫిర్యాదులపై త్వరగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో సత్యనారాయణ ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

'ప్రిన్సిపాళ్ల పదోన్నతులు ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ మేరకు కల్పించాలి'

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 17: రాష్ట్ర వ్యాప్తంగా 210 ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రిన్సిపాల్ పదోన్నతులు ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ మేరకు కల్పించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, వెంగల్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆలీఖాన్, ఈశ్వర్‌చంద్ర శనివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏకపక్షంగా ఏపీపీ ఎస్సీ ద్వారా నియామకం పొందిన డైరెక్ట్ రిక్రూట్‌మెంటు జూనియర్ లెక్చరర్లకు లబ్ధిపొందేలా పదోన్నతులు కల్పిస్తామంటున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి పొందిన పాఠశాల విద్యాశాఖ స్కూలు అసిస్టెంట్లకు న్యాయం జరుగుతుందన్నారు. సమాన స్థాయిలో ఉన్న జూనియర్, సీనియర్లకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఒక జూనియర్ అసిస్టెంటు డీఈఓ అవుతున్నాడని, ఒక ఎస్జీటీగానే రిటైర్ అవుతున్నాడని, దీనిపై స్పష్టమైన సర్వీసు నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రమోటీ డీర్, నాన్ టీచింగ్ స్టాఫ్ సమ్మిళిత సీనియారిటీ జాబితా తయారు చేసి అభ్యంతరాలను పరిశీలించిన తరువాతే ప్రిన్సిపాల్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

నూతన పీఠాధిపతిగా సగిలి ప్రకాష్


ఫాదర్ సగిలి ప్రకాష్

కడప (కల్చరల్), ఫిబ్రవరి 17: ఖమ్మం జిల్లా మేత్రాసన పీఠాధిపతిగా కడప జిల్లావాసి రెవరెండ్ డాక్టర్ ఫాదర్ సగిలి ప్రకాష్‌ను నియమించినట్లు కడప అపోస్తులిక పాలనాధికారి రెవరెండ్ గాలిబాలి పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం స్థానిక మరియాపురంలోని బిషప్ హౌస్‌లోని పరిశుద్ధ దేవాలయంలో జిల్లాలోని గురువులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోమ్ నగరంలోని ఫ్రాన్సిస్ పోప్ ఆదేశాల మేరకు సగిలి ప్రకాష్ ఖమ్మం పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. కలసపాడు మండలం మహానందిపల్లెకు చెందిన సగిలి ప్రకాష్ 1984లో కడప మరియాపురం చర్చి గురువుగా నియమితులయ్యారన్నారు. నాటి నుంచి నేటి వరకు దైవసేవలోనూ, విశ్వాసులను ముందుకు నడిపించడంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాదర్లు, గురువులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

బి.కోడూరు, ఫిబ్రవరి 17: మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి మహేశ్వరకుమార్ బద్వేలు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తూ ఎల్ఆర్ డీప్ ఫ్రిజర్ సరిగ్గా పనిచేస్తున్నాయా, వ్యాక్సిన్ క్యారియర్లు ఐస్ బాక్సు సరిపడా ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు జరిగేటట్లు చూడాలని స్టాఫ్‌నర్సులకు సూచనలు ఇచ్చారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం

● టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 17: వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం అయిందని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. శనివారం కడప నగరం 28వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలిపారు. అలాగే టీడీపీ ప్రభుత్వం వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. అనంతరం ఆమెతో పాటు జన సేన కడప ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రజా సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. అలాగే వైసీపీ అరాచకాలు ఎక్కువయ్యాయని, ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటుతో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ, నాయకులు రాఘవ, అల్లావుద్దీన్, రవిశంకర్‌రెడ్డి అల్లాబకాష్, కమాల్‌బాషా, జిలానీబాషా, జమీల్, అఫ్జల్, బాషా, జైకుమార్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం: కడప నగరం 28వ డివిజన్‌లో టీడీపీ డివిజన్ కార్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ పట్టణ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. టీడీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, రాఘవ, కమాల్, జమీల్, అల్లాబకాష్, అబుజర్, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీలో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపుదాం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 17 : రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి ఇంటికి సాగనంపాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని అప్పాయపల్లె ఎస్సీ కాలనీ, గాంధీనగర్, వినాయక్‌నగర్ పోలీసులైను, అక్సానగర్ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమలాపురం మేజర్ పంచాయతీగా ఉండేదని, నగర పంచాయతీగా మార్చాలంటే దాదాపు 20 వేల జనాభా ఉండాలని, జనాభా తక్కువగా ఉన్నా ఈ వైసీపీ నాయకులు కమలాపురాన్ని నగర పంచాయతీగా మార్చి ప్రజలను ఉపాధి పనులకు దూరం చేశారన్నారు. నగర పంచాయతీ చేయడం వల్ల ప్రతి సంవత్సరం రెండు సార్లు పన్నులు చెల్లించాల్సి వస్తుందని, దాని వల్ల పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అన్ని కులాల వారికి మేలు జరిగేదన్నారు. సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక రంజాన్ తోఫా వంటి పథకాలతో వారి కుటుంబాల్లో ఆనందంగా పండుగ జరుపుకునే విధంగా పరిపాలన చేశారన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ఈ రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఏటూరి రామచంద్రరెడ్డి, ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఆసుపత్రి అభివృద్ధి కమిటి మాజీ చైర్మన్ జంపాల నర్సింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, యల్లారెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి, రామమునిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గండి నారాయణ, మల్లేష్‌రాయల్, మేరీ, గుజ్జుల నారాయణరెడ్డి, కరీం, భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ రమణ, శంకర్‌యాదవ్, రవిశంకర్‌యాదవ్, దాది రామయ్య, ప్రసాద్‌రెడ్డి, నబీరసూల్, రెహానా, చెన్నక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

ఘనంగా రాములవారి పాదుకలకు పూజలు

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 17:మండలంలోని ఎరమలపల్లె గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం పండితులచే అయోధ్య శ్రీరాముడి పాదుకలకు ప్రత్యేక పూజలు జరిపించారు. సంప్రదాయబద్ధంగా దంపతులచే హోమాలు చేపట్టారు. పాదుకల దర్శనం కోసం భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ హోమాలకు ప్రదక్షిణలు చేపట్టారు. ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌లో ఉంచి బాణసంచా పేలుస్తూ మంగళవాయిద్యాల నడుమ అంగరంగవైభవంగా ప్రధాన రహదారి గుండా గ్రామోత్సవం చేపట్టారు. గ్రామోత్సవం వెంట కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


శ్రీరాముని పాదుకలను దర్శించుకుంటున్న భక్తులు

ఈఈ గంగయ్యకు సన్మానం

చక్రాయపేట, ఫిబ్రవరి 17: దేవదాయధర్మాదాయ శాఖ డీఈగా పనిచేస్తున్న కాకర్ల గంగయ్యకు ఇటీవల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా శనివారం ఆ శాఖ సహాయ కమిషనర్ ముకుందరెడ్డి, ప్రధాన అర్చకుడు కేసరి, ఉప ప్రధాన అర్చకుడు రాజాస్వాములు ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగయ్య గండి దేవస్థానం గుడి నిర్మాణం కోసం ఎంతో కృషిచేశారన్నారు.


గంగయ్యను సత్కరించిన ముకుందరెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులు సంఘటితంగా పోరాడాలి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 17: ప్రభుత్వ ఉద్యోగులు సంఘటితంగా పోరాడాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ సీపీ ఆనంద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఉద్యమాన్ని దెబ్బతీసే కుట్ర పన్ను తున్నారన్నారు.

వెలగని లైట్లు... నగరంలో అంధకారం

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 17 : కడప నగరంలోని పలు ప్రధాన చౌరస్తాలు అంధకారంలో మగ్గుతున్నాయి. రోడ్లపై వీధి దీపాలు లేకపోవడంతో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అయినా సౌకర్యాలు కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. మౌలిక వసతులపై దృష్టి పెట్టకపోవడంతో కడప నగరంలోని ప్రధాన కూడళ్లల్లో వీధి దీపాలు వెలగక రోజూ అమావాస్య చీకట్లే కనిపిస్తున్నాయి. వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేసి వెలిగేటట్లు చేయాలని కోరుతున్నారు.


కడప కోటిరెడ్డి సర్కిల్‌లో వెలగని విద్యుత్ దీపాలు

పులివెందుల జేఎన్టీయూను సందర్శించిన నూతన వీసీ

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 17: పులివెందుల జేఎన్టీయూ కళాశాలను అనంతపురం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న అనంతరం మొదటిసారి పులివెందులకు వచ్చిన ఆయనకు పులివెందులలో ప్రిన్సిపాల్ ఆర్.రమణారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అన్ని డిపార్ట్‌మెంట్‌ల వద్దకెళ్లి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నాక్ కమిటీ వస్తున్నందున గ్రేడ్ సాధించేందుకు కావాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వి.సుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూర్యనారాయణరెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

వేంపల్లె, ఫిబ్రవరి 17: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని విద్యార్థులను కోరారు. శనివారం పలు జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులను వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సందర్శించి విద్యార్థులకు వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదివేందుకు అధ్యాపకబృందం కరపత్రాలు పంపిణీ చేసి విద్యార్థులతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఓబుల్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 17: నగరంలోని ఆజాద్‌నగర్‌లో నిర్వహిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి శనివారం విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం నుంచి సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్వీ రమణ రూ.30వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో తల్లిదండ్రులను తమ వద్ద ఉంచుకుని సేవ చేయాలన్నారు. తల్లిదండ్రులను ఎల్లవేళలా కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. పని ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్న ఇలాంటి సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సేవా సంఘం ప్రెసిడెంట్ నాగరాజు, జనరల్ సెక్రటరీ చలపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శివభాస్కర్ పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సీమకు వైసీపీ చేసిందేమీ లేదు: కుంచం

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 17: రాయలసీమ ప్రాంతానికి వైసీపీ చేసిందేమీ లేదని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి 17 అసెంబ్లీ స్థానాలు మాత్రమే రావచ్చన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రాష్ట్ర సంపదను దోచుకోవడంలో చూపిన శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. కడప పార్లమెంట్ అభ్యర్థిగా తాను పోటీచేయనున్నారని, గెలిపిస్తే కడప-బెంగళూరు రైల్వే మార్గాన్ని పూర్తి చేసేందుకు సహకరిస్తానని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాపై మరింత దృష్టి పెట్టాలి

● ప్రతి బూత్ నుంచి మెజార్టీ వచ్చేలా కృషి చేయాలి

● టీడీపీ మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి

చెన్నూరు, ఫిబ్రవరి 17: మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బూత్ ఇన్‌చార్జ్‌లకు ఇచ్చిన ఓటర్ల జాబితాపై మరింత దృష్టి సారించాలని మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చెన్నూరు టీడీపీ కార్యాలయంలో బూత్ ఇన్‌చార్జ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి బూత్ ఇన్‌చార్జ్ తన పరిధిలోని ప్రజలను చైతన్యపరిచి వారిని టీడీపీ వైపు ఆకర్షితులను చేయాలన్నారు. అలాగే ఫోన్ ద్వారా టీడీపీ యాప్‌లో సూపర్‌సిక్స్ పథకాల గురించి చెప్పడం, ఓటు ఎలా వేయాలనేది వివరించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని, ప్రత్యర్థి పార్టీ వారు ప్రలోభాలకు తెర లేపే అవకాశం ఉందని, వాటిని తిప్పికొడుతూ మన ఓటింగ్ శాతం పెంచుకోవాలన్నారు. ఇటీవల పార్టీలోకి వస్తున్నవారు, అలాగే జనసేన సభ్యులతో కలిసి పర్యటించాలన్నారు. పుత్తాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, జడా లక్ష్మీనారాయణ, కొండపేట సుధాకర్‌రెడ్డి, అతికారి విశ్వం, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, పార్టీ కార్యాలయ కార్యదర్శి ముక్తియార్, బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి సుబ్రమణ్యం, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, తెలుగుయువత జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి, యువనేతలు సంజీవ్‌పవన్, ప్రవీణ్, రాష్ట్ర బెస్తసాధికార సమితి కార్యవర్గసభ్యులు మల్లే సుబ్బయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి

'ఇంటింటికీ సీపీఎం' కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

● పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 17 : ఇంటింటికీ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని రామక్రిష్ణనగర్‌లో ఇంటింటికీ భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఒక తాటిమీదకు తేవడానికి పార్టీ ప్రయత్నిస్తోందన్నారు. ప్రజల కష్టాలను పాలుపంచుకుంటూ సేవ చేయడంలో సీపీఎం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటోందన్నారు. కరోనా కష్టకాలంలో రాష్ట్రంలో కడప జిల్లాలో పలుచోట్ల వైద్య క్యాంపులను నిర్వహించి వేలాది మంది నిరుపేద ప్రజలకు ఆహారధాన్యాలు, భోజన ప్యాకెట్లు అందించిందన్నారు. దళితుల పేదల భూములను కబ్జా చేసే బడా పార్టీ నేతలు ఆగడాలను ఎప్పటికప్పుడు ప్రతిఘటిస్తూ ప్రజలకు అండగా నిలబడిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కడప నగర కమిటీ సభ్యుడు డీఎం ఓబులేసు, ఎస్.రాజేంద్ర, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

భవిత విద్యార్థులకు వీల్‌చైర్స్ పంపిణీ

వేంపల్లె, ఫిబ్రవరి 17: వేంపల్లెలోని భవిత దివ్యాంగుల విద్యావనరుల కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా వీల్‌చైర్స్ ఎంపీడీఓ దివిజ సంపతి శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారులకు వీల్‌చైర్స్‌ను అడిగిన తక్షణమే అందించడం సంతోషకరంగా ఉందన్నారు. చిన్నారులకు ఉపకరణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం జ్యోతి అనే చిన్నారికి అనారోగ్యంతో బాధపడుతున్నందున తనవంతుగా రూ.1000 నగదును ఎంఈఓ జాఫర్ సాదిక్ అందించారు. చిన్నారులకు అడిగిన వెంటనే స్పందించి ఉపకరణాలు ఎంపీడీఓ అందించడం సంతోషకరంగా ఉందన్నారు. అనంతరం జడ్పీ హైస్కూల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టీచర్ ప్రభావతి, టీచర్ శ్రీనివాసులరెడ్డి దంపతుల కుమార్తె నేహశ్రీ పుట్టిన రోజు సందర్భంగా భోజనం ఏర్పాటు చేశారు. ఎంఈఓలు జాఫర్‌సాదిక్, స్టాలిన్‌బజాక్, ఐఈఆర్పీలు యశోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


భవిత విద్యార్థులకు వీల్‌చైర్స్ అందించిన ఎంపీడీఓ దివిజసంపతి

వేసవి రాకముందే ఎండిపోయిన పెన్నా


చెన్నూరు వద్ద పెన్నానదిలో నీటి జాడ లేక పూర్తిగా ఎండిన దృశ్యం

చెన్నూరు, ఫిబ్రవరి 17 :పెన్నానది గత కొన్నేళ్లుగా వేసవిలో సైతం నీటి ప్రవాహంతో ఉండేది. అయితే ఈ మారు మాత్రం వేసవి రాక ముందు చెన్నూరు వద్ద పూర్తిగా ఎండిపోయింది. నీటి జాడే లేకుండాపోయింది. దీంతో రైతులు వేసవి రాక ముందే నది ఎండిపోయిందే, ఇక ఏప్రిల్, మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గండికోట జలాశయం పూర్తయింది మొదలు అక్కడ నుంచి మైలవరం గుండా పెన్నానదికి ప్రతియేటా వేసవిలో సైతం నీరు ప్రవహిస్తుండేది. ఎలాంటి ఇబ్బంది లేకుడా రైతులకు బోర్ల ద్వారా నీరందడంతో పాటు కడప నగరానికి తాగునీటికి ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఈ మారు ఆ పరిస్థితి కనిపించడంలేదు. చెన్నూరు, కొండపేట మధ్య కనీసం నదిలో నీటి జాడ తేమ ఛాయ కూడా కనిపించకుండా ఎండిపోయి ఇసుక దర్శనమిస్తోంది. మూడు అడుగులు నదిలో ఇసుకను తవ్వితే తప్ప నీటి జాడ కనిపించని పరిస్థితి ఏర్పడింది ఫిబ్రవరి రెండో వారంలోనే ఈ పరిస్థితి ఉంటే ఎలా అని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే కేసీ కాల్వకు నీరు లేక ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పెన్నాలో నీరు లేకపోతే బోర్లలో కూడా నీటిమట్టం తగ్గుతుందంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని గండికోట జలాశయం నుంచి నీరు నదిలోకి వదలాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీకి భంగపాటు తప్పదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 17: ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి భంగపాటు తప్పదని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని ముసల్ రెడ్డిపల్లెలో మాజీ సర్పంచ్ పాణ్యం వెంకటసత్యం ఆధ్వర్యంలో 30 కుటుంబాలు, నాగలకుంట్లలో వెంకటరెడ్డి, చిన్నయ్య ఆధ్వర్యంలో 40 కుటుంబాలు, రామేశ్వరంలో శంకరయ్యతో సహా 30 కుటుంబాలు మొత్తం 100 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో విసిగిపోయిన ప్రజానీకం టీడీపీ వైపు మొగ్గుచూపుతుందన్నారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరకూరి చెన్నరాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగిరి భైరవ ప్రసాద్, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, కొండా రామక్రిష్ణరెడ్డి, కల్వకూరి చిన్నవెంకటసుబ్బయ్య, రావూరి నాగభూషణం, ఎంపీటీసీ కల్వకూరి రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నాగులకుంట్లలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్న దృశ్యం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

బి.కోడూరు, ఫిబ్రవరి 17: మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి మహేశ్వరకుమార్ బద్వేలు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ శని వారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తూ ఎల్ఆర్ డీప్ ఫ్రిజర్ సరిగ్గా పనిచేస్తున్నాయా, వ్యాక్సిన్ క్యారియర్లు ఐస్ బాక్సు సరిపడా ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు జరిగేటట్లు చూడాలని స్టాఫ్‌నర్సులకు సూచనలు, సలహాలు అందించారు. మరాటిపల్లెలో జరుగుతున్న ఇమ్యునైజేషన్‌ను తనిఖీ చేసి.. వేసవికాలంలో వ్యాక్సిన్ క్యారియర్‌లో టెంపరేచర్ మెయింటెనెన్స్ చేయాలని తెలిపారు. హెల్త్ ఆఫీసరు మునిరెడ్డి, స్థానిక వైద్యాధికారి ఉదయ కిరణ్, హెల్త్ సూపర్‌వైజరు జాన్ విలియం, ఏఎన్ఎం కుమారి పాల్గొన్నారు.

గోపవరంలో...: గోపవరం శివార్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో వి.మల్లేశ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో సిబ్బంది సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మండల వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజరు శివరామిరెడ్డి, సీహెచ్‌వో గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులతో పెట్టుకుంటే పతనం తప్పదు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 17: ఉద్యోగులతో పెట్టుకున్న ప్రభుత్వాలకు పతనం తప్పదని, వైసీపీ ప్రభుత్వం కూడా పతనం కాకతప్పదని ఏపీ జేఏసీ తాలూకా చైర్మన్ కేజీ రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ధర్నా న్విహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 64 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, 50 లక్షల మంది ఉద్యోగులు వైసీపీ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారన్నారు. ఐదేళ్లపాలనలో రాష్ట్రప్రభుత్వం ఏరోజూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని విమర్శించారు. 15 డిమాండ్ల పరి ష్కారం కోసం ఎంత దూరమైనా వెళతామన్నారు.ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ 90 శాతం మంది ఉద్యోగులు ఈ ప్రభుత్వాన్ని ఇష్టపడి అధికారంలోకి తెస్తే నట్టేట ముంచిందని విమర్శించారు. బకాయిలు చెల్లించాలని ఉద్యోగులు ధర్నా చేసే దుస్థితి ఏర్పడిం దన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల్లో సీపీఎస్ అమలవుతుండగా సీపీఎస్‌ను రద్దు చేస్తా మన్న ముఖ్యమంత్రి జగన్ జీపీఎస్‌ను అమలు చేయడం దారుణమ న్నారు. ఈసందర్భంగా ఎన్జీఓ అసోసియేషన్ కార్యాలయం నుంచి శివా లయం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏపీజేఏసీ కన్వీనర్ రామసుబ్బ య్య, పెన్షనర్స్ అసోసియేషన్ కార్య దర్శి వెంకటయ్య యాదవ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవీంద్రుడు, సదా శివయ్య, జయరామిరెడ్డి, జయమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నూతన పీఆర్‌సీ తక్షణం అమలు చేయాలి

బద్వేలు, ఫిబ్రవరి 17: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించడంతో పాటు నూతన పీఆర్‌సీ అమలు చేయాలని ఏపీ జేఏసీ నేతలు నరసింహారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మాదన విజయ్‌కుమార్, రామచంద్రారెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తాలూకా కమిటీ ఆధ్వర్యంలో బద్వేలులో శనివారం ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఏపీ ఎన్జీవో తాలూకా ఉపాధ్యక్షుడు మల్లికార్జునరావు, ట్రెజరర్ శివరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ వెంకటమ్మ, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, ట్రెజరర్ గంగన్న పాల్గొన్నారు.

జమ్మలమడుగులో ఉద్యోగుల నిరసన

జమ్మలమడుగు, ఫిబ్రవరి 17: జమ్మలమడుగు పాత బస్టాండు గాంధీ విగ్రహం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జమ్మలమడుగులోని తాలూకా యూనిట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విశ్రాంత ఉద్యోగులు తదితరులు గాంధీ విగ్రహం ఎదుట రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ 12వ పీఆర్‌సీలో మధ్యంతర భృతి తక్షణమే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, సీపీఎస్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దేవదానం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ముద్దనూరు ఫిబ్రవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఏపీ జెఏసీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ముద్దనూరు తాలూకా జేఏసీ అధ్యక్షులు సత్యానంద్‌బాబు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రకటించిన రెండు డీఏలు, పీఆర్సీ బకాయి, మధ్యంతర భృతి 30శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. తాలూకా జేఏసీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త అధ్యక్షుడు వీరప్రసాద్‌రెడ్డి, పెన్షనర్ సంఘం అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : ధర్నాలో మాట్లాడుతున్న కేజే రఘురామిరెడ్డి



జమ్మలమడుగు : గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ జేఏసీ తాలూకా యూనిట్ ఉద్యోగులు

డిగ్రీకళాశాల అభివృద్ధికి రూ.50వేలు విరాళం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 17: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్వపు విద్యార్థి, టీడీపీ ఎంపీటీసీ కల్వకూరి రమణ రూ.50వేలు విరాళం ఇచ్చారు. శనివారం ఆయన ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వైస్ ప్రిన్సిపల్ ప్రకాశరావు, సీనియర్ అధ్యాపకురాలు సులోచనలకు రూ.50వేలు విరాళం అందించారు. కళాశాల ప్రిన్సిపల్ నరేష్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

రాజుపాలెం, ఫిబ్రవరి 17: గురుకుల పాఠశాలలో 2023-24 సంవత్సరం ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీషు మీడియంలో చదివేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లాల బాలయోగి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తులశమ్మ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల్లో 2023-24 సంవత్సరం ఐదో తరగతి ప్రవేశం కోసం నాలుగో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి 2023-24 ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాల న్నారు. ఈనెల 23లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

PUBLIC NOTICE

Iam instructed by my client-Firm M/s Shriram Finance Ltd., Badvel Branch, rep. by the Branch Manager to Publish this notice as follows : Sri one **Kalavakuri Chennamma W/o Seshaiah** r/o 4/104,Kamavaripalli village, Porumamilla Mandal, Kadapa Dt. has applied for loan by offering the below mentioned property as security.On scrutinizing the documents over the property. my client-firm decided to grant loan to the applicant named above. Hence If anybody has got any objection/ any righ over the property and if any litigation are pending in the Court of Law over the property, it shall be brought to themy clients notice with documentary proof, else, it will be proceed further in the matter if Any such objections received after five days,they will not be taken into account. **Particul ars of Property :** Kadapa Dt, Prodda tur Registration Dt, Badvel Sub-District, Porumamilla mandal, Ranga samudram village fields Sy. No. 176,-Ac. 0.02.84 cents (137.77 sq. yards) out of Ac.1.10 cents out of Ac.6.88 cents demarked as Plot No.4, in the weaker section area Located near Door No.5/56 **Boundaries :** East - in the same Survey Number site purchased by Boyapati Lakshmi Prasanna on 16-12-2002, South - Cement Road width 18 Feets, West - Cement Road width 16 Feets, North - Site of Gudeboina Suseela **Measurements :** East - West - 31 Feet (9.44 Mtrs.) North - South - 40 Feet (12.19 Mtrs.) - with all easement rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

PUBLIC NOTICE

Iam instructed by my client-Firm M/s Shriram Finance Ltd., Badvel Branch, rep. by the Branch Manager to Publish this notice as follows : Sri one **Tirumalasetty Nagesu S/o Nagaiah** r/o 2/107, Gurppagaripalli village, Porumamilla Mandal, Kadapa Dt. has applied for loan by offering the below mentioned property as security.On scrutinizing the documents over the property. my client-firm decided to grant loan to the applicant named above. Hence If anybody has got any objection/any righ over the property and if any litigation are pending in the Court of Law over the property, it shall be brought to themy clients notice with documentary proof, else, it will be proceed further in the matter if Any such objections received after five days, they will not be taken into account.
Particulars of Property : Kadapa Dt, Proddatur Registration Dt, Badvel Sub-District, Porumamilla mandal, Rangasamudram village fields Sy.No.176,-Ac.0.04 cent and 753 links or 230.08 sq. yards, out of Ac.1.10 cents out of Ac.6.88 cents demarked as Plot No.7,in the 5th ward of weaker section area Located near Door No.5/56
Boundaries : East - Road width 18 Feets, South - Plot No.8 sold to M.Rani in the same Survey Number, West - Site vide Plot No.12, North - Site sold to Kalavakuru Ramesh and ors.
Measurements : East - West both sides 62 Feet (18.87 Mtrs.) North - South - Eastern Side 34.8 Feet (10.59 Mtrs.) Western Side 32 Feet (9.74 Mtrs.) - Totaling to 230.08 Sq. Yards - with all easement rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

ఏడాదికి రూ.500 కోట్లు తెస్తానన్న నిధులేవి రాచమల్లు

● టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 17: ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏడాదికి రూ.500 కోట్ల తెస్తానన్న నిధులేవో ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధికి అడ్డుగా రాచమల్లు ఉండాడని.. పరిపాలన చేతగాని ఎమ్మెల్యేను ప్రజలు గద్దెదింపాలంటూ మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో బైఠాయించి ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.

ఈసందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ప్రొద్దుటూరు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయ డంలో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి విఫలం అయ్యారన్నారు. ప్రజా సమస్యల పరి ష్కారవేదికగా వుండాల్సిన మున్సిపాలిటీని వైసీపీ కార్యాలయంగా మార్చారని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఐదు ప్రధాన సమస్యలపై గళం విప్పారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్యం మెరుగు చేయడంలో విఫలం అయ్యారని, దోమలు లేని ప్రొద్దుటూరుగా మార్చి ప్రతి దశరాకు అల్లుళ్లను తప్పెట్లతో తెస్తానన్న హామీలను ఎమ్మెల్యే వమ్ముచేశాడన్నారు. ప్రొద్దు టూ రును అన్ని విధాల అభివృద్ధి చేసి ఎన్నిలకు పోతున్నానని చెబుతున్న ఎమ్మెల్యే ఏమి అభివృద్ధి చేశాడో ప్రజలకు చెప్పాలన్నారు. రాచమల్లును గద్దె దింపి టీడీపీ అధికారంలోకి తెచ్చుకుంటే ప్రొద్దుటూరు రూపురేఖలే మార్చు తామన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వైఎస్ జబీవుల్లా, మహి ళా అధ్యక్షు రాలు బోగాల లక్ష్మీనారాయణమ్మ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ బండి భాస్క ర్‌రెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకరవేణు, వార్డు ఇన్ చార్జులు సుబ్బు, పొట్టిపాటి గంగాధర్, ఇట్టె సునీల్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ఏ సంఘటన జరిగినా 100కు డయల్ చేయండి

మైదుకూరు, ఫిబ్రవరి 17 : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా గ్రామంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని.. ఏచిన్న సంఘటన జరిగినా లేదా జరుగు తుందనే సమాచారం అందినా 100కు డయల్ చేయాలని సీఐ ఏపీ మస్తాన్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లె దళిత వాడలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అసాంఘిక కార్య కలాపాలు, ఘర్షణలకు పాల్పడవద్దని.. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే జీవితాంతం కేసులు ఉంటాయన్నారు.

వైసీపీ పాలనలో భూదందాలు తప్ప చేసిందేమీ లేదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 17: వైసీపీ పాలనలో రాష్ట్రంలో లిక్కర్‌మాఫియా, ఇసుక మాఫి యా, భూదందాలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయజ్యోతి అన్నారు. శనివారం ఆమె పోరుమామిళ్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్‌లాంటి పరిపాలన అందించాలంటే అది వైఎస్ షర్మిలకే సాధ్యమన్నారు. షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలోపేతం అవుతుందన్నారు. ప్రజలందరూ ఆలోచించి తమ ఓటు హక్కును కాంగ్రెస్‌కు వేయాలన్నారు.

మొక్కలు నాటి పర్యావరణం రక్షించండి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 17 : మొక్కలు నాటి పర్యావరణం పరిరక్షించాలని బిజివేముల వీరారెడ్డి కళా శాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటసుబ్బారెడ్డి, ఎన్‌సీసీ యూనిట్ సమన్వయకర్త ఈశ్వరయ్యలు అన్నారు. శనివారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపులో భాగంగా గుంతపల్లె గ్రామంలో ఎన్‌సీసీ విద్యార్థులతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంటు రామ్మోహన్, దొరస్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కర్పూరి ఠాగూర్ 36వ వర్ధంతి

బద్వేలు, ఫిబ్రవరి 17: పట్ట ణంలోని బీసీ చైతన్య సమితి ఆధ్వర్యంలో భారతరత్న కర్పూ రి ఠాకూర్ 36వ వర్ధంతి కార్య క్రమం శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున మాట్లా డుతూ బీహార్ రాష్ట్రంలో వెనుకబడిన పేద నాయిబ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఠాకూర్ రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా పని చేసిన ఆయన సామాజిక న్యాయం, కులాంతర వివాహాలు, సంపూర్ణ మద్యపాన నిషేధం, బీసీలకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు మొదలగు చట్టా లను అమలు పరిచారన్నారు. 1988 ఫిబ్రవరి 17న ఆయన మరణించేనాటికి సరైన సొంత ఇల్లు కూడా లేదన్నారు. బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీసీ రమణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురు మూర్తి, జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు రమణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు సంఘటితంగా పోరాడాలి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 17: ప్రభుత్వ ఉద్యోగులు సంఘటితంగా పోరాడాలని అప్పుడే ఉద్యోగుల హక్కులు సాధించుకోగలమని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ సీఏ ఆనంద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులలో కొందరు దుష్టశక్తులు చీలికలు తెచ్చి ఉద్యమాన్ని దెబ్బతీసే కుట్ర పన్నుతున్నారన్నారు. ఏపీ ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడు ఎంవీ ప్రబాకర్ రావు, కార్యదర్శి రామచంద్ర, డాక్టర్ నరసింహ, బండి రాజా రత్నం తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ సీఐపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 17: జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌పై జిల్లా అధికారులు విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అర్బన్ సీఐ కరుణాకర్ చేస్తున్న అన్యాయాలపై జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి ధర్నా చేపట్టారు. పోలీసు స్టేషన్‌లో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నిస్తే ఆ సీఐ నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతారన్నారు. ఫ్రెండ్లీ పోలీసుగా పోలీసు స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరిని సామరస్యంగా సమస్యలు అడిగి పరిష్కరించాల్సిన అధికారే దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు.

పోర్ట్ చట్టంపై అవగాహన

జమ్మలమడుగు, ఫిబ్రవరి 17: జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం పోర్ట్ చట్టంపై జడ్జి భార్గవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి భార్గవి మాట్లాడుతూ తోటి ఉద్యోగులు కార్యాలయాల్లో లైంగిక వేధింపులకు పాల్పడినా, హేళనగా మాట్లాడినా వెంటనే తెలియజేయాలన్నారు. ఎక్కడ సమస్య ఉన్నా మహిళా ఉద్యోగులు భయపడకుండా నేరుగా ఫిర్యాదు చేసి సమస్యకు పరిష్కారం పొందాలన్నారు. కార్యక్రమంలో బార్ సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది మునిసుబ్బారెడ్డి, భూతమాపురం సుబ్బారావు, జంబాపురం మహేశ్వరి, మునీరా పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన జడ్జి : జమ్మలమడుగు పట్టణంలో శనివారం జడ్జి భార్గవి ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా సబ్‌జైలును తనిఖీ చేసి అక్కడ అధికారులతో, రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. అక్కడి నుంచి నాగులకట్టవీధి, ప్రభుత్వ బాలికల ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థినులకు మౌలిక వసతులపై ఆరా తీశారు. వంటగదిని పరిశీలించి భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాది జ్యోతి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు రావాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 17: మహిళలు అభివృద్ధి పథంలో నడవాలంటే తిరిగి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శనివారం ఖాజీపేట అగ్రహారంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సూపర్-6 పథకాలను మహిళలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక్క చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, మహిళాభివృద్ధి చెందుతుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు సుబ్బయ్య, వీరయ్య, టీడీపీ నాయకులు బొంగు శ్రీనివాసులు, కొమ్మరాజు రమణ, ప్రశాంత్, శ్రీకాంత్,రమణయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


మహిళలకు మేనిఫెస్టోను వివరిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

టీడీపీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టో అమలు

కొండాపురం, ఫిబ్రవరి 17: టీడీపీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో ప్రకటిం చిన విధంగా మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏడాదికి రూ.20,000 తదితర కార్యక్రమాలను చేపడతామని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దొబ్బుడుపల్లె, తిరుమలాయపల్లె, రాగికుంట గ్రామాలలో శనివారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా టీడీపీ అధినేత చంద్రబాబుకే ఉందన్నారు.. రాబోయే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి అభ్యర్థించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, కోడూరు ఎంపీటీసీ సభ్యుడు రామమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దొబ్బుడుపల్లెలో టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి

ఏపీని లూటీ చేసిన ముఖ్యమంత్రి జగన్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 17: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని లూటీ చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొ న్నారు. శనివారం స్థానిక 24వ వార్డు మౌలానా ఆజాద్‌వీధిలో బాబూ ష్యూరి టీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమం వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈసందర్భంగా బాబు గ్యారెంటీలపై కర పత్రాలు పంపిణీ చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, బచ్చల వీరప్రతాప్, బద్వేలు రవి, మేస్త్రీ బాషా, బేపారి గౌస్ పాల్గొన్నారు.


మౌలానా ఆజాద్‌వీధిలో ప్రచారం చేస్తున్న వరదరాజులరెడ్డి

బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ

అట్లూరు, ఫిబ్రవరి 17: మండలంలోని కొండూరు పంచాయతీలో బాబు షూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమాన్ని కడప పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షురాలు పాల కొండు సుధా నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ గోపినాథ్‌పురం, కొండూరు ఎస్సీ కాలనీ వాసులను, మహి ళలను ఆకట్టుకున్నారు. కొండూరు ఎంపీటీసీ బోవిళ్ల లక్ష్మిదేవి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు అమర్‌నాదరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

చాపాడు, ఫిబ్రవరి 17: చాపాడులోని గాయత్రి హైస్కూలులో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ పలువురిని ఆకట్టుకుంది. చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల, ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. చంద్రయాన్-3, హైడ్రాలిక్ బ్రిడ్జి వంటి పలు రకాల ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఎంఈవో-2 వంశీకృష్ణ ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు.

వైసీపీకి భంగపాటు తప్పదు


నాగులకుంట్లలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్న దృశ్యం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 17: ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి భంగపాటు తప్పదని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని ముసల్‌రెడ్డిపల్లెలో మాజీ సర్పంచ్ పాణ్యం వెంకటసత్యం ఆధ్వర్యంలో 30 కుటుంబాలు, నాగలకుంట్లలో వెంకటరెడ్డి, చిన్నయ్య ఆధ్వర్యంలో 40 కుటుంబాలు, రామేశ్వరంలో శంకరయ్యతో సహా 30 కుటుంబాలు మొత్తం 100 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో విసిగిపోయిన ప్రజానీకం టీడీపీ వైపు మొగ్గుచూపుతుందన్నారు. మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ చెరకూరి చెన్నరాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, కొండా రామ క్రిష్ణరెడ్డి, కల్వకూరి చిన్నవెంకటసుబ్బయ్య, రావూరి నాగభూషణం, ఎంపీటీసీ కల్వకూరి రమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.